తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



వడమాలపేట, జూన్ 11 ప్రభాతవార్త: అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. జూన్ 17 నుంచి 25 తేదీ వరకు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పై కప్పు, పూజా సామగ్రి తదితర అని వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు.

## నేడు తిరుమలకు చంద్రబాబు

### -రేపు ఉదయం ఇష్టదైవమ్ ఆశీస్సులు



తిరుమల, జూన్ 11ప్రభాతవార్తప్రతినిధి: ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న నారా చంద్రబాబు నాయుడు ఇష్టదైవమ్ వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం నేటి రాత్రికి తిరుమలకు వస్తున్నారు. కుటుంబసభ్యులతో కలసి ముఖ్యమంత్రి హోదాలో వస్తుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. బుధవారం రాత్రి 7.45గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని రోడ్డుమార్గంలో 9గంటలకు తిరుమలలోని గాయత్రి నిలయం అతిధిగృహం చేరుకుంటారు. చంద్రబాబునాయుడు, ఆయన సతీమణి నారా భువనేశ్వరి, నారా దేవాన్ష్, బాలకృష్ణ, వసుంధర కుటుంబసభ్యులు నేటిరాత్రికి తిరుమలలోనే బసచేస్తారు. గురువారం (రేపు)ఉదయం అతిథి గృహం నుండి 7.30గంటలకు వెంకన్నను దర్శనం చేసుకుంటారు.

## సీఎం ప్రమాణ స్వీకార వీక్షణకు పక్కా ఏర్పాట్లు



విద్యుత్‌కాంతులలో కళకళలాడుతున్న జిల్లా సచివాలయం

చిత్తూరు, జూన్ 11 ప్రభాతవార్త: గన్నవరం మండలం కేసరపల్లె గ్రామంలోని ఐటీ పార్క్ ప్రాంగణంలో బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా ఈకార్యక్రమంను ప్రత్యక్షంగా వీక్షించడానికి పక్కా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ షగిలి షన్మోమన్ ఆదేశించారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకార ఏర్పాట్లుపై కలెక్టర్ మంగళవారం సాయంత్రం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ రాష్ట్రప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార జిల్లాస్థాయి కార్యక్రమం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఉదయం 10 గంటలకు ప్రారంభ మవుతుందన్నారు. ఈకార్యక్రమం పండుగ వాతావరణం ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమంను ప్రజలు వీక్షించేలా మండలస్థాయిలో ఎంపీడీఓ కార్యా లయం లేదా కమ్యూనిటీ హాల్‌లలో, నియోజకవర్గ స్థాయిలో ఏదేని గుర్తించిన పెద్దహాలు, కళ్యాణమండపాల్లో ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే గ్రామ పంచాయతీ స్థాయిలో కమ్యూనిటీహాలు వంటి వాటిలో ప్రజలు వీక్షించేలా టీవీ, ఇంటర్‌నెట్, డిష్‌లను ఏర్పాటు చేయాలన్నారు. చిత్తూరు జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు కలెక్టరేట్, జడ్పీ, జిల్లా, నియోజకవర్గ, డివి జినల్, మండల రెవెన్యూ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు, గ్రామస్థాయి కార్యాలయాలలో విద్యుత్ లైట్లు చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరు కావడానికి జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుండి నాలుగు బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మంగళవారం సాయంత్రానికి 28 బస్సులు గన్నవరంకు బయలు దేరాయన్నారు. బస్సుల్లో వెళ్ళిన వారిని జాగ్రత్తగా తిరిగి తీసుకురావడం కోసం ఒక అధికారిని నియమించి బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు.

## చంద్రబాబుకు భారీ భద్రత

### -పోలీసు అధికారులే పర్యవేక్షణ





తిరుమల, జూన్ 11, ప్రభాతవార్త ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన అనంతరం తిరుమలకు వస్తున్న చంద్రబాబుకు గట్టి భద్రత కల్పిస్తున్నారు. ఆయన పర్యటన ఏర్పాట్లు, భద్రతపై స్వయంగా తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, టిటిడి సివిఎస్ఓ నరసింహకిశోర్. విఎస్ఓనందకిశోర్, సిఐ విజయకుమార్ ఆలయం పరిసరాలు, గాయత్రి నిలయం అతిధిగృహం ప్రాంతాలను తనిఖీ చేశారు.

## నీట్‌లో మెరిసిన రైతు బిడ్డ

### ఫస్ట్ ర్యాంక్ సాధించిన ముఖేష్ చౌదరి



బాలాయపల్లి, జూన్ 11, ప్రభాతవార్త మండలంలోని వెంగమాంబపురం గ్రామంలో ఓ సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన వడ్లపూడి మురళి నాయుడు, బేబీ సరళ దంపతుల రెండవ కుమారుడు వడ్లపూడి ముఖేష్ చౌదరి నీట్ 2024 ఓపెన్ కేటగిరిలో ఆల్ ఇండియా స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించారు. 720/720 మార్కులు సాధించడంతో విద్యార్థి ముకేష్ చౌదరిని శ్రీ చైతన్య విజయవాడలో డైరెక్టర్ సుష్మ, టెక్నో స్కూల్స్ డైరెక్టర్ సీమలు, సిబ్బంది అభినందించారు. జాతీయ స్థాయి నీట్ 2024లో రాయలసీమకి వన్నె తెచ్చిన బాలాయపల్లి మండలం వెంగమాంబపురం నీట్ విద్యార్థి ముఖేష్ చౌదరి, వారి తల్లిదండ్రులను శ్రీ చైతన్య డైరెక్టర్లు సుష్మ, సీమలు, సిబ్బంది అభినందించారు. నగదు ప్రోత్సహకాలు అందజేశారు. తల్లిదండ్రులు ముఖేష్ చౌదరి శ్రీ చైతన్య గోశాలలోని శ్రీ వైభవి క్యాంపస్ నుండి నీట్ కోచింగ్ తీసుకుని అగస్థానంలో మెరిసి జాతీయ స్థాయిలో నిలిచారన్నారు. ర్యాంకర్ ముఖేష్ మాట్లాడుతూ న్యూరాలజీ డాక్టర్‌గా స్థిరపడి పేదలకు సేవలందించలన్నదే తన లక్ష్యమని అన్నారు. ఢిల్లీలో ఎయిమ్స్‌లో కోర్సు పూర్తి చేస్తానని ముఖేష్ తెలిపారు. తెలంగాణ ఎంసెట్‌లో సైతం రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. ఇంతటి ఘన విజయానికి కళాశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు కారణమని విద్యార్థి తెలిపారు. గ్రామంలో ఆనందం వెళ్ళు విరిసింది.




## బంగారమ్మ ఆలయంలో జాతర సంబరాలు

### సారె అందించిన ఆలయాధికారులు

### ముగ్గులతో ఆకర్షణ





శ్రీకాళహస్తి జూన్ 11 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న బంగారమ్మ ఆలయంలో జాతర సంబరాలు మిన్నుముట్టాయి. శ్రీకాళహస్తి పిచ్చాటూరు మార్గంలో వెలసిన గ్రామ దేవత ఆలయాన్ని బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మంత్రిగా ఉన్నపుడు ఆలయానికి అనుబంధంగా తీసుకున్నారు. ఇక్కడ ఆలయం అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం ఈ గ్రామ దేవత ఆల యం కైలాసగిరి, ఉపాధ్యాయనగర్, ఎల్ఐసి కాలనీ, రాజీవ్‌నగర్ వాసులకు అందుబాటులో ఉంది. ప్రతి ఏడాది ఇక్కడ జాతర సంబరాలను భారీ ఎత్తున నిర్వహిస్తారు. జాతర నిర్వహణ కు స్థానికులు కమిటిని ఏర్పాటు చేసుకున్నారు.

**అమ్మవారికి అభిషేకాలు:**

బంగారమ్మ ఆలయంలో వెలసిన దేవేరి బంగారమ్మకు మంగళవారం వేకువ జామున ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో స్థానిక భక్తుల సందడి చోటు చేసుకుంది. ఆలయ సంప్రదాయంమేరకు దేవస్థానం నుంచి సంప్రదాయం మేరకు సారెను అందించారు. అమ్మవారికి అభిషేకాల్లో భక్తిశ్రద్దలతో పాల్గొన్న దేవస్థానం అధికారులు జాతర సందర్భంగా నిర్వహించే గెరిగే ఉత్సవంలో పాల్గొన్నారు. ఉత్సవం చుట్టుపక్కల ప్రాంతాల్లో సాగింది. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. పంబజోళ్ళ మేళాలతో గగుర్పాటు కల్పించే విదంగా ఉత్సవం సాగింది. ఈ సందర్భంగా తెట్టురాయికి ప్రత్యేక పూజలు జరిపారు. తరువాత ఆలయం వద్ద అంబళ్ళు నిర్వహించగా చట్టుపక్కల పరిసరాల్లోని ప్రజలు అంబళ్ళు పోసారు. తరువాత ఆలయ ఆవరణలో మొదట మైలుముగ్గును, తరువాత మధ్యాహ్నం పోతురాజు ముగ్గును నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో పొంగళ్ళు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఆలయ తరఫున ఎసి మల్లికార్జున్ ప్రసాద్ ఎఇఓ సతీష్‌మాలిక్, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్యల సారధ్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



## చంద్రబాబు నివాసం వద్ద కుప్పం దేశం నేతల సంబరాలు

కుప్పం, జూన్ 11 ప్రభాతవార్త



ఉండవల్లిలో కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నివాసం వద్ద కుప్పం తెదేపా నేతలు ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ అధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా పార్టీ ఘన విజయం సాధించడంతో పాటు చంద్రబాబునాయుడు మరలా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న తరుణంలో కుప్పం నుంచి ప్రమాణస్వీకారానికి తరలిన నేతలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్‌ను ఈసందర్భంగా పలువురు నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో కుప్పం ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడకు భారీగా తరలిన తెదేపా శ్రేణులు

కుప్పం, జూన్ 11 ప్రభాతవార్త



కుప్పంలోని తెలుగుదేశం పార్టీ శ్రేణులు మంగళవారం కుప్పం నుంచి విజయవాడకు భారీగా తరలివెళ్లారు. బుధవారం తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో ఈ వేడుకల్లో పాల్గొనేందుకు పార్టీ, ప్రభుత్వం తరపున ఏర్పాటుచేసిన బస్సుల్లో కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. అలాగే కార్లు, రైళ్ల ద్వారా కూడా నేతలు, కార్యకర్తలు విజయవాడకు తరలివెళ్లారు.

## ప్రమాణస్వీకారానికి తరలిన తెలుగుతమ్ముళ్లు

శాంతిపురం, జూన్ 11 ప్రభాతవార్త



తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు శాంతిపురం మండలం నుంచి తెదేపా నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా బస్సులు, కార్లలో కార్యకర్తలు బయలుదేరారు. తొలుత స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. జై బాబు జైజై బాబు అంటూ నేతలు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్, మణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారానికి తరలిన టిడిపి శ్రేణులు

పలమనేరు, జూన్ 11,ప్రభాతవార్త:



నేడు అమరావతిలో ముఖ్యమంత్రిగా నారా చంద్ర బాబు నాయుడు ప్రమాణ స్వీకారానికి పలమనేరు నియోజకవర్గం నుండి మంగళవారం టిడిపి శ్రేణులు భారీగా తరలివెళ్లారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని టిడిపి శ్రేణులను ప్రమాణ స్వీకారానికి వెళ్లేందుకు 4 బస్సులను ఏర్పాటు చేశారు.ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పలమనేరు తహసీల్దార్ రంగనాయకులు 4 బస్సులకు బస్సులకు పూజలు నిర్వహించి బస్సులను ప్రారంభించారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాలతో పాటు పలమనేరు నియోజకవర్గం నుండి సుమారు 20 బస్సులలో టిడిపి శ్రేణులు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి తరలివెళ్లారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి, న్యాయవాదులు బార్ అసోషియేషన్ అధ్యక్షులు లక్ష్మీపతి,సీనియర్ న్యాయవాది ఎల్.బాస్కర్,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉన్మాదంగా ప్రవర్తించిన వ్యక్తి మృతి

కుప్పంరూరల్, జూన్ 11 ప్రభాతవార్త

కుప్పం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నబంగారునత్తంకు చెందిన రామస్వామి (67) మృతి చెందాడు. ఇతను సోమవారం మారణాయుధం చేతపట్టుకుని గ్రామస్తులపై దాడికి యత్నించిన నేపథ్యంలో అతన్ని గ్రామస్తులు దేహశుద్ధి చేసి పోలీసుల సహకారంతో కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించిన విషయం విదితమే. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామస్వామి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పంచనామాకు తరలించారు. కాగా రామస్వామి ఇదివరకే ఓ హత్యకేసులో జైలుకుపోయి వచ్చి మద్యానికి అలవాటుపడి గ్రామంలో ఉన్మాదంగా ప్రవర్తించేవాడని తెలిసింది. కుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## హెచ్‌డిఎస్ ఛైర్మన్‌కు కళ్యాణ్ భరత్ రాజీనామా

చౌడేపల్లి, జూన్ 11 ప్రభాతవార్త



ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్ష పదవికి కళ్యాణ్ భరత్ రాజీనామా చేసారు. మంగళవారం ఈమేరకు ఆయన మండల వైద్యాధికారిణి పూజకు రాజీనామా పత్రాన్నందించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా పరాజయం చెందిన సందర్భంగా నైతిక విలువలకు కట్టుబడి హెచ్‌డిఎస్ ఛేర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇంత కాలం తనకు సహకరించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఆశా కార్మికుల నూతన కమిటీలు ఎన్నిక

చౌడేపల్లి, జూన్ 11 ప్రభాతవార్త




మండలంలోని చౌడేపల్లి, లద్దిగం ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆశా కార్మికుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు ఆధ్వర్యంలో ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. చౌడేపల్లి పిహెచ్‌సి కమిటీ అధ్యక్షురాలుగా అనూరాధా, కార్యదర్శిగా రత్నమ్మ, సహాయ కార్యదర్శిగా నాగమ్మ, కోశాధికారిగా లక్ష్మీదేవి, మరో 10మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. లద్దిగం పిహెచ్‌సి కమిటీ అధ్యక్షురాలుగా లీలావతి, కార్యదర్శిగా సావిత్రి, ఉపాధ్యక్షురాలుగా హేమలత, కోశాధికారిగా సుబ్బమ్మ,మరో 7గురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

## అమరావతికి తరలిన తెలుగు తమ్ముళ్ళు

చౌడేపల్లి, జూన్ 11 ప్రభాతవార్త



రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్ర బాబు నాయుడు ప్రమాణ స్వీకారాన్ని పుర ష్కరించుకొని మండల తెలుగు తమ్ముళ్ళు వెళ్ళారు. మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి), యువనేత మాదిరాజు ప్రదీప్‌రాజు, శ్రీధర్‌రాజు (గిరి)లు జెండావూపి బస్సును ప్రారంభించారు. రానున్నది రామ రాజ్యమనీ, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమపాలల్లో పరుగలు తీస్తుందన్నారు. మండలంలోని తేదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాణిపాకం జడ్పీ హైస్కూల్ స్థల కబ్జాను అడ్డుకోండి

కాణిపాకం, జూన్ 11 ప్రభాతవార్త:

కాణిపాకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలాన్ని కబ్జా చేసి నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలని మండల జనసేన నాయకులు కాణిపాకం ఆలయ ఉభయదారుడు రాజ్‌కుమార్, మండల బిజెపీ అధ్యక్షుడు ఎం.కుమార్‌లు మంగళవారం ఐరాల తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కాణిపాకం ఉన్నత పాఠశాల అభివృద్ధి దృష్ట్యా అగరంపల్లెకు చెందిన ఓ దాత సర్వేనెంబర్ 362, 363, 130 లలో 2.47 ఎకరాల భూమిని విరాళంగా అందజేసి పాఠశాల పేరిట రిజిష్టర్ చేయించినట్లు పేర్కొన్నారు. అయితే స్థల దాత కుమారుడు కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ తనకున్న పలుకుబడితో తప్పుడు పత్రాలు సృష్టించి విరాళంగా అందజేసిన స్థలంలో కొంత భాగాన్ని కబ్జాచేసి అక్రమంగా కట్టడాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. దీనిపై విచారించి సమగ్ర సర్వే నిర్వహించేంత వరకు అక్రమ కట్టడాల నిర్మాణాలను ఆపాలని రాజ్‌కుమార్, కుమార్‌లు ఐరాల తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తూ వినతిపత్రం అందజేశారు.

## ప్రమాణ స్వీకారంకు భారీగా తరలిన కూటమి తమ్ముళ్ళు

కాణిపాకం, జూన్ 11 ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు చేపట్టనున్న టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడి ప్రమాణ సీ్వకార కార్యక్రమానికి పూతలపట్టు నియోజకవర్గం నుండి టీడీపీ, జనసేన, బిజెపీ కూటమిలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మంగళవారం భారీగా తరలివెళ్ళారు. ఈకార్యక్రమానికి హాజరయ్యేందుకు నియోజకవర్గంలోని మండలాల నుండి ఎన్డీఏ కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మంగళవారం సాయంత్రం బయలుదేరి వెళ్ళారు. ఇందులో భాగంగా కొంత మంది కాణిపాకం ఆలయంలో స్వామివారికి మొక్కులు తీర్చుకుని, పూజలు చేసి బయలుదేరి వెళ్ళారు.

## ప్రమాణ స్వీకారానికి తరలిన టిడిపి నాయకులు, కార్యకర్తలు

పాకాల, జూన్ 11, ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 4వసారి బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా, అదే విధంగా చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యేగా పులివర్తి నాని ప్రమాణ స్వీకారానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ మంగళవారం పాకాల మండలం టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గన్నవరంలో ప్రమాణ స్వీకారం ప్రాంగణానికి తరలివెళ్లారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రజలు మెచ్చిన ప్రజానాయకుడు చంద్రబాబు

– ఎంపి దగ్గుమళ్ల

చిత్తూరురూరల్, జూన్ 11 ప్రభాతవార్త:

ప్రజలు మెచ్చిన ప్రజానాయకుడు, టిడిపి అధినేత, ఆంధ్రప్రదేశ్‌కు కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల వరప్రసాద్ రావు కొనియాడారు. ఎన్డీఏ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నికైన తర్వాత చంద్రబాబు ప్రసంగమే ఆయన దార్మినికతకు అద్దం పట్టిందన్నారు. ప్రజాసేవకు మారుపేరైన చంద్రబాబు ప్రజల ఆకాంక్షల కనుగుణంగా పారదర్శకతో కూడిన పాలన అందించగలరనీ, ఆంధ్రప్రదేశ్‌ను కూడా అభివృద్ధివైపు నడిపించగలరని దగ్గుమళ్ల వరప్రసాద్‌రావు ఆశాభావం వ్యక్తం చేసారు.

## ఎంసెట్ ఫలితాల్లో విజయం విద్యార్థుల ప్రతిభ

చిత్తూరురూరల్, జూన్ 11 ప్రభాతవార్త :




నేడు ప్రకటించిన ఏపి ఎంసెట్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచారని విజయం విద్యా సంస్థల అధినేత డా.ఎం.తేజోమూర్తి తెలిపారు. ఎస్. సౌమ్య(10781), లీనా (10900), సుకేష్(11000), మనోజ్ (12607) ర్యాంకులు సాధించారన్నారు. అలాగే వీరితో పాటు 26మంది విద్యార్థులు 20వేలలోపు ర్యాంకులు సాధించారని తెలిపారు.

## యువతకు ఆరదర్శం " గువ్వల రమేష్‌రెడ్డి "



–ఘనంగా జన్మదిన వేడుకలు

చౌడేపల్లి, జూన్ 11 ప్రభాతవార్త

మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) యువ తకు ఆదర్శప్రాయు డని పలువురు కొనియాడారు. మంగళవారం రమేష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన అభిమాను లు, తేదేపా నాయకులు స్థానిక బస్టాండులో వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. రాజకీయ కుటుంబ నేపథ్యంలోంచి వచ్చిన గువ్వల రమేష్‌రెడ్డి ఆయన తండ్రి దివంగత గువ్వల రామకృష్ణారెడ్డి వారసత్వాన్ని పునికి పుచ్చుకొన్నారన్నారు. బస్టాండు, ఆయన నివాసం తెల్లనీళ్ళ పల్లిల్లో అన్నదాన శిబిరాలు ఏర్పాటు చేసారు. తేదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిఎం ప్రమాణ స్వీకారానికి తరలివెళ్ళిన తమ్ముళ్లు

పాలసముద్రం, జూన్ 11, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నాలుగవ సారి బాధ్యతలు చేపట్టనున్న సందర్భంగా అమరావతికి ప్రత్యేక బస్సులో పాలసముద్రం మండలానికి చెందిన తెలుగు దేశం నాయకులు, కార్యకర్తలు అభిమానులు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భారీగా తరలి వెళ్లారు. జై తెలుగుదేశం, జై చంద్రబాబు,జైథామస్, జై చిట్టిబాబు, జై నారా లోకేష్, జై పవన్, జై మోడి, అంటూ నినాదాలు చేశారు.

## తహశీల్దార్ కార్యాలయంలో విద్యుద్దీపాలతో అలంకరణ

పాలసముద్రం, జూన్ 11, ప్రభాతవార్త

పాలసముద్రం మండలం తహశీల్దార్ కార్యాలయాల ప్రాంగణాల్లో చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం సందర్భంగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే లైవ్ స్ట్రీమింగ్ విధానంలో మండలంలో ఓటచోట ఎక్కువ మంది వీక్షించేలా తహశీల్దార్ కార్యాలయంలో తెరలు సిద్ధం చేశామని తహశీల్దార్ సుబ్బలక్ష్మి తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ప్రత్యేక్ష ప్రసారం ద్వారా ప్రజలకు ప్రజాప్రతినిధులు వీక్షించేలా తహశీల్దార్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వీక్షణ ఏర్పాటు చేసారు. అందువల్ల ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలంకరణతో అలంకరించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి టౌన్, జూన్ 11, ప్రభాతవార్త



టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే నారా లోకేష్‌ను ఎమ్మెల్యే కురు గొండ్ల రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలో లోకేష్‌ను కురుగొండ్ల కలిసి అభినందనలు తెలిపారు. సిఎం అభ్యర్థిగా చంద్ర బాబు నాయుడు ఎన్నికల కావడంతో ఆయనను కూడా ఎమ్మెల్యే రామకృష్ణ అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు.

## నేడు వైసిపి కార్యకర్తలు, నాయకులు రామ్ కుమార్ రెడ్డి భేటీ

వెంకటగిరి టౌన్, జూన్ 11, ప్రభాతవార్త



వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో భేటీ అవుతారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు ఆయన వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో అందరికి అందుబాటులో ఉండి వచ్చే వారిని కలుసుకుని పలు అంశాల పై చర్చించనున్నారు. వైసిపి పార్టీ ఓటమి తర్వాత ఆయన చేపట్టే భవిష్యత్తు కార్యక్రమాల కార్యాచరణ విషయాలను పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించనున్నారు.

## ప్రమాణ స్వీకార పండగకు ప్రత్యేక బస్సులు

కోట, జూన్ 11 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారి కోసం ప్రతి నియోజకవర్గానికి నాలుగు బస్సులు కేటాయించారు. వెళ్లే వారికి ప్రత్యేకంగా పాసులు జారీ చేశారు. వీటిని అధికారులు అందజేశారు. కోట మండలం నుంచి ఓ బస్సును ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఓ శంకరయ్య తెలిపారు. రాష్ట్రంలో కూటమి తరపున 164 మంది అభ్యర్థులు విజయం సాధించిన నేపథ్యంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారాన్ని వీక్షించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. లైవ్ స్ట్రీమింగ్ విధానంలో తెరలపై ప్రదర్శించనున్నారు.

## దొంగతనం కేసులో ముగ్గురు అరెస్ట్

కోట, జూన్ 11 ప్రభాతవార్త

కోట, వాకాడు, నాయుడుపేట పోలీసుస్టేషన్ల పరిధిలో గత నాలుగు నెలల నుంచి దొంగతనాలు జరుగుతున్నాయి. ఆ క్రమంలో దొంగతనం చేసిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వాకాడు మండలం కొండూరుపాలెం గ్రామానికి చెందిన దుస్తాది చెరు, కోటకు చెందిన బందిలి శీను, సూళ్లూరుపేట మండలం వత్రపాలెంకు చెందిన ముత్తుకు దిలీప్‌లను కోట మండలం చిట్టేడు ఎస్సీ గురుకుల పాఠశాల వద్ద అరెస్టు చేశామని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 107.99 గ్రాముల బంగారం, 243 గ్రాముల వెండి, హోండా షైన్ బైక్ స్వాధీనం చేసుకున్నారు.

## పాఠశాల ప్రారంభం రోజే కిట్లు పంపిణీ

కోట, జూన్ 11 ప్రభాతవార్త

పాఠశాలలు పునఃప్రారంభం రోజే విద్యార్థులు విద్యాకానుక కిట్లు అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కోట మండల విద్యాశాఖ అధికారి మస్తానయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ పుస్తకాలు, టై, బెల్టు తదితర వస్తువులు ప్రభుత్వం అందజేసిందని పేర్కొన్నారు. బూట్లు, బ్యాగులు మాత్రం రావాల్సి ఉందన్నారు. ఇదిలావుంటే గత ప్రభుత్వ హయాంలో జగనన్న విద్యాకానుక పేరుతో వీటిని ఆర్భాటంగా అందజేశారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం రావడంతో కిట్లు పేరు మార్పు చేశారు. ప్రస్తుతానికి స్టుడెంట్ కిట్ పేరుతో పంపిణీ చేపట్టాలని మౌఖిక ఆదేశాలు అందాయి.

# ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించండి

సూళ్లూరుపేట, జూన్ 11 ప్రభాతవార్త




సూళ్లూరుపేట పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు దృష్టి సారించాలని కౌన్సిలర్లు మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో విజ్ఞప్తి చేశారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో నిర్వహించిన సమావేశంలో కౌన్సిలర్లు పలు సమస్యలపై ప్రశ్నల వర్షం కురిపించారు. పట్టణంలో రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ఆక్రమణలు, తోపుడుబండ్లు, పార్కింగ్ లేని స్థలాల్లో కూడా మోటార్‌బైక్‌లు, కార్లు నిలుపుదల చేయడం వంటి అంశాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని అన్నారు. ఇందుకు స్పందించిన కమిషనర్ గంగాప్రసాద్ పోలీసుల సహకారం తీసుకొని త్వరలోనే పరిస్థితిని చక్కదిద్దుతామన్నారు. పట్టణంలో పారిశుధ్యం లోపం ఎక్కువగా ఉందని గత రెండు నెలలుగా పారిశుధ్యం సక్రమంగా చేయడం లేదని సభ్యులు గట్టిగా ప్రశ్నించారు. అలాగే బఫర్ జోన్లలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల కోఆప్షన్ సభ్యులు కళత్తూరు సునీల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ చిన్ని సత్యనారాయణ మాట్లాడుతూ కౌన్సిల్‌లో సభ్యులకు అసలు విలువే లేదన్నారు. ఏ అధికారి తమ మాటలు వినడం లేదని, అభివృద్ధి పనులు చెప్పినా చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న చిన్న పనులు కూడా మున్సిపాలిటీలో చేయలేకపోతున్నారని అన్నారు. వినాయకగుడి సెంటర్ నుంచి పాండురంగ వీధికి వచ్చే మార్గంలో గత రెండేళ్లుగా కల్వర్టులు కుంగిపోయి ఉన్నప్పటికీ వాటిని ప్రతి కౌన్సిల్ సమావేశంలో మరమ్మతులు చేస్తామని ప్రకటిస్తున్నారే గాని ఇంతవరకు ఎటువంటి మరమ్మతులు చేయలేదని చెప్పారు. కూరగాయల మార్కెట్ వరకు నూతనంగా సిమెంటు రోడ్డు వేసి మిగతా రోడ్డును వేయకుండా వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలన్నింటిపై కమిషనర్ గంగాప్రసాద్ స్పందిస్తూ ఎన్నికల కారణంగా కొన్ని పనుల్లో జాప్యం జరిగిందని, పారిశుధ్యంతో పాటు ఇతర సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## వేటకు వేళాయె.. పరిహారం రాదాయే..!

కోట, జూన్ 11 ప్రభాతవార్త

ప్రభుత్వం విధించిన వేట నిషేధం ఈ నెల 14తో ముగియనుంది. ఇప్పటికే వేటకు వెళ్లేందుకు మత్స్యకారులు సిద్ధమవుతున్నారు. గత ఏడాది వేట నిషేధం తర్వాత ఎప్పుడో అరకొరగా ఊహించిన స్థాయిలో మత్స్యసంపద చిక్కలేదు. ఏడాదిలో పెట్టిన పెట్టుబడి రాక నష్టాలు చూడాల్సిన పరిస్థితి. రెండు నెలల పాటు ఇళ్లకే పరిమితమైన మత్స్యకారులు ఈ ఏడాది అయినా లాభాల బాటలో మత్స్యసంపద ఉంటుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. వేట నిషేధ సమయంలో ప్రభుత్వం నుంచి అందే పరిహారం ఈ సారి అందలేదు. మరో మూడు రోజుల్లో నిషేధం ముగుస్తున్నా పరిహారం అందలేదని వాపోతున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిహారం ఇస్తారని అధికారులు పేర్కొంటున్నారు.

## సహకార సంఘ కమిటీల రాజీనామాలకు ఆదేశం

పర్సన్ ఇన్ ఛార్జీల నియామకానికి సన్నాహాలు

కోట,మే 11 ప్రభాతవార్త

సహకార సంఘ కమిటీ సభ్యుల రాజీనామాకు ప్రభుత్వం నుంచి ఆశాఖ జిల్లా అదికారులకు ఆదేశాలు అందాయి. సహకార సంఘాల పాలక వర్గకాల పరిమితి 2018 తో ముగిసింది.ఈ సమయంలో తెదేపా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. పర్సన్ ఇన్‌చార్జీలను నియమించింది.2019 లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా ఆ పార్టీకు చెందిన నాయకలతో పాలవర్గ కమిటీలను నియమిచింది. ఒకోకక్క సంఘాలనికి చైర్ సర్సన్ ఇద్దరు సభ్యులు చొప్పున నియమించారు. గత ఐదేళ్లగా కమిటీలను పునరుద్దరించడం,నూతన కమిటిల ఏర్పాటుతో కాలయాపన చేశారు..కమిటీల స్దానంలో అధికారులను పర్సన్ ఇన్‌ఛార్జీలుగా నియమించేందుకు ఆదేశాలు జారీ అయ్యాయి. వాటికి అనుగుణంగా ఆయా సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జీలను నియమించేందుకు అధికారుల పేర్లుతో సహకార శాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారని తెలిసింది.

## ఉపాధ్యాయ ఖాళీల వివరాల సేకరణ

కోట,మే 11 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ పైనే మొదటి సంతకం పెడతానని స్వాత్రిక ఎన్నికల ప్రచారంలో తెదేపా అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీనిచ్చారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. దీంతో నేడు బుధవారం ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆరోజు మోగా డీఎస్సీ దస్త్రం పై సంతకం పెడతారన్న ఊహాగానాల నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ యంత్రాగం అప్రమత్తమైంది. గతేడాది డిసెంబర్ వరకు విరమణ అయిన ఖాళీలతో సహా ప్రతి ఖాళీని గుర్తించి వివరాల పంపాలని ప్రభుత్వం ఆదేశించింది.మూడు నాలుగు రోజుల నుంచి డీఈవోలు ఇతర కార్యాయల సిబ్బంది ఉపాద్యాయ ఖాళీల వివరాలను సేకరించి పనిలో తలమునకలై ఉన్నారు. దీంతో మెగా డీస్సీకు సన్నాహాలు ఊపదుకోవడంతో ఉపాధ్యా వర్గంలో ఆనందం వ్యక్తమవుతోంది. తమపై సనిభారం తగ్గుతుందని నాణ్యమైన చదువులకు అస్కారం ఏర్పడి పిల్లల ప్రవేశాలకు పెరుగుతాయని ఉపాధ్యా వర్గం అంటోంది. సుదీర్ఘ విరామం తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ రానుండటంతో కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు తిరిగి కోచింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేసుకునే పనిలో పడ్డారు.

## ప్రమాణ స్వీకారానికి బయలుదేరిన తెలుగు తమ్ముళ్లు

నాయుడుపేట (పెళ్లకూరు), జూన్ 11 ప్రభాతవార్త



బుధవారం ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న కార్యక్రమానికి పెళ్లకూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలుఎంతో ఉత్సాహంతో తరలివెళ్లారు. దామర్ల ప్రసాద్‌నాయుడు, శేఖర్‌నాయుడు, సిద్దుల నాయుడు, కెవి నాయుడు, ప్రసాద్‌నాయుడు, ఉదయ్‌కుమార్ నాయుడు, నరేంద్రనాయుడు, మోహన్‌నాయుడు, ముని రామానాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు.

## సిఎం ప్రమాణ స్వీకారానికి వాకాడు నుండి బస్సు

వాకాడు, జూన్ 11, ప్రభాతవార్త



అమరావతిలో బుధవారం ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేయునున్న సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని టిడిపి కార్యకర్తలతో ప్రత్యేక బస్సును అధికారులు, ప్రజాప్రతినిధులు పంపారు. మండల కేంద్రమైన వాకాడులో తహశీల్దార్ కార్యాలయం, పరిషత్ కార్యాలయం, సచివాలయాలు కార్యాలయాలకు ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. తహశీల్దార్ కార్యాలయం నుండి తహశీల్దార్ నరసింహారావు, వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, తదితరులు ముందస్తు విజయ చిహ్నంతో వేడుకలు నిర్వహించారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అధికారులు

రేణిగుంట, జూన్ 11 ప్రభాతవార్త:

రేణిగుంట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆశాడే సందర్భంగా అసిస్టెంట్ జోనల్ డైరెక్టర్ త్యాగరాజు, జిల్లా మలేరియా అధికారి రూప్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశ వర్కర్లు ఇంటింటికి తిరిగి అంటు వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. నిర్లక్ష్యం చేసిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ, మండల వైద్యాధికారి ఛత్రప్రకాష్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు తదితరులు పాల్గొన్నారు.

# దేవేరికి ముత్యాలకవచం వితరణ


శ్రీకాళహస్తి జూన్ 11 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి మంగళవారం అమెరికా వాసులు అందించినఅలంకరణ వస్తువులతో అలంకరించారు.

పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న పలు పథకాలకు భక్తుల నుంచి విరాళాలు అందుతున్నాయి. ఈనేపథ్యంలో బూస్టర్ అమెరికాలో స్థిరపడ్డ ఐకా రవి, గాయిత్రి దంపతులు అమ్మవారికి మొక్కు తీర్చుకొనుటకు ఐదు నెలల క్రితం ముత్యాలు పొదిగిన చీర, కిరీటం, కరవచం, వడ్డాణం, హస్తం, పాదాలు తయారు చేయించి అందించారు. దానిని సీనియర్ వేదపండితులు చంద్రశేఖర్ స్వామి దంపతుల ద్వారా ఆలయానికి అందించారు. ఐదునెలల క్రితం ఆలయానికి అందించిన విరాళాన్ని తాము వచ్చినపుడు అలంకరించాలని కోరారు. ఈ మేరకు మంగళవారం వారు రాగా అలంకరింపజేసారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరుతారక శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాళహస్తికి చెందిన దంపతులు అమెరికాలో స్థిరపడ్డారని వారిని అభ్యర్థింగా వారు విలువైన కానుకను అందించారన్నారు. వాటిని మంగళవారం అలంకరించామన్నారు. అమెరికా వాసుల కానుకలను అమ్మవారిని ముస్తాబు చేయగా చూడటానికి వేయికళ్ళు అయినా చాలవన్నట్లు మారింది. అమ్మవారికి కోట్ల విలువైన వజ్రకిరీటాలు, చీర, హస్తాలు ఉన్నాయి. శుక్ర, మంగళవారాల్లో వాటితో ముస్తాబు చేస్తున్నారు. దాంతో ప్రత్యేకత సంతరించుకుంటుంది. కార్యక్రమాల్లో అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున్ ప్రసాద్, కాణిపాకం మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ మోహన్‌రెడ్డి, ఎఇఒ సతీష్‌మాలిక్, దేవస్థానం అభిషేక గురుకుల్స్ సాథని రాజేష్‌గురుకుల్, స్థాని సురేష్ గురుకుల్, దాతల కుటుంబసభ్యులు శ్రీకాంత్, శ్రీధర్, రవి, దేవస్థానంకు చెందిన సుదర్శనం రెడ్డి, కామేశ్వరరావు ,కంఠా ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ అమ్మవారిని దర్శించుకున్న మేయర్ డాక్టర్ శిరీష



తిరుపతి కార్పొరేషన్, జూన్ 11 ప్రభాతవార్త ం గంగమ్మ జాతర తర్వాత వచ్చే మూడవ మంగళవారం అమ్మవారిని పండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లిని తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష దర్శించుకున్నారు. ఈఓ మమత, అర్చకులు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి తీర్థ ప్రసాదాలు అందజేసారు.




## ఆరని అగ్ని జ్వాలలు

- మాంబట్టు సెజ్ వద్ద సమీప పరిశ్రమలకూ భయం



తడ, జూన్ 11 ప్రభాతవార్త : తడ మండలం మాంబట్టు పారిశ్రామికవాడ వద్ద సోమవారం సాయంత్రం అంటుకున్న స్క్రాప్ మంటలు ఇంకా చల్లారలేదు. మంగళవారం సాయంత్రానికి కూడా అక్కడ అగ్ని జ్వాలలు, దట్టమైన పొగ మేఘాలు కనిపిస్తున్నాయి. సమీపంలోని గ్రామాల ప్రజలతో పాటు పలు పరిశ్రమల వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. దగ్గరలో ఉన్న ఇళ్లలో దట్టమైన పొగ చేరడంతో కాలుష్యం భయం పట్టుకుంది. ఇదిలావుంటే ఈ పరిశ్రమను ఆనుకొని ఉన్న మరిన్ని పరిశ్రమల వారు ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. అందుబాటులో అగ్నిమాపక యంత్రాలను ఉంచి మంటలు అంటుకుంటే ఆర్పడానికి సిద్ధంగా ఉన్నారు. వేలాది మంది కార్మికులు పనిచేస్తున్న అపాచీ షూ తయారీ కేంద్రం వద్ద కూడా ఆందోళన నెలకొంది. ఇక్కడ షిఫ్టులవారీగా పనిచేస్తున్న కార్మికుల కోసం నిత్యం వందలాది వాహనాలు వెళుతుంటాయి. వీటన్నింటినీ దారి మళ్లించారు. మంగళవారం మధ్యాహ్నానికి సెజ్ రోడ్డును కొంత క్రమబద్ధీకరించి ఒకలైనులో వాహనాలను వదులుతున్నారు. మంగళవారం సాయంత్రం జాతీయ రహదారిపైకి పరిశ్రమల వాహనాలు చేరుకొని ఒకదానికొకటి పోటీపడుతూ ప్రమాదకరంగా వేగంతో వెళుతున్నాయి. ఈ స్క్రాప్ పరిశ్రమలో అగ్నిజ్వాలలు పూర్తిగా ఎప్పటికి చల్లారుతాయో అని సామాన్యులు సైతం ఎదురు చూస్తున్నారు.

## చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తా

- ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తా -చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని



తిరుపతిరూరల్, జూన్ 11 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు చంద్రగిరి అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ శాసనసభాపక్ష నాయకుడిగా నారా చంద్రబాబునాయుడు ఎన్నిక కార్యక్రమం మంగళవారం విజయవాడలో అట్టహసంగా జరిగిన విషయం తెల్సిందే. టిడిఎల్‌పి సమావేశానికి హాజరైన పులివర్తి నానిని మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. చంద్రగిరిలో నెలకున్న పరిస్థితులును లోకేష్ అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇచ్చిన మాట మేరకు చంద్రగిరి నియోజకవర్గాన్ని సర్వవిధాల అభివృద్ధికి కృషి చేయడానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. చంద్రగిరిని అన్ని విధాల అభివృద్ధి చేసి, రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా రోల్‌మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని లోకేష్‌కు నాని తెలిపారు.




## గరుడ శేషవాహనంపై ఊరేగిన ఇంద్రవరదుడు



యాదమరి, జూన్ 11 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని త్రివేణి సంగమంలో వెలసిన ఇంద్రవరదుడి బ్రహ్మోత్సవాలు ఈనెల 7వ తేది ధ్వజారోహణంతో ప్రారంభమై కనులవిందుగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్ర వరదరాజస్వామి మూలవర్గకు వేదపండితులు పుష్పకైకంర్యం నిర్వహించారు. అనంతరం ఇంద్రవరదుఢి ఉత్సవ విగ్రహాన్ని గరుడవాహనంపై వుంచి పురవీధుల్లో ఊరేగించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రాత్రి కల్పవృక్ష వాహనంపై ఇంద్రవరదుడుని అధిష్టించి పురవీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు దర్శనబాగ్యం కల్పించారు. ఈ వాహన ఊరేగింపులో మండల పరిసర గ్రామస్తులు అధిక సంఖ్యల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకొన్నారు.

## గణనాధుని సేవలో కాణిపాకం ఆలయ పునర్నిర్మాణ దాతలు



కాణిపాకం, జూన్ 11 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ప్రధాన ఆలయ పునర్నిర్మాణ దాతలు విజయవాడకు చెందిన ప్రవాస భారతీయులు ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్, వారి ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణప్రసాద్‌లు కుటుంబసమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారుస్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ దేవస్థానం మాజీ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.




## సృజనాత్మకత వెలికితీతకు వేసవిశిక్షణా శిబిరాలు

- జిల్లా విద్యాశాఖాదికారి దేవరాజులు



చిత్తూరురూరల్, జూన్ 11 ప్రభాతవార్త: విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడం కోసమే జిల్లా బాలభవన్ ఆద్వర్యంలో వేసవిశిక్షణా శిబిరాలను ఏర్పాటుచేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజులు పేర్కొన్నారు. స్థానిక తపోవనం ఆశ్రమ పాఠశాల నందు బాలభవన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంను జిల్లా బాలభవన్ పర్యవేక్షకులు కె. రామచంద్రారెడ్డి ఆహ్లాదకర వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇవో దేవరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో తమ ప్రావీణ్యాన్ని చూపడంతో పాటు తమ సత్తాను చాటాలని పేర్కొన్నారు. అనంతరం శిక్షణలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు రామచంద్రారెడ్డితో పాటు అటెండర్ బాబా, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## 184 శ్లోకాలతో అయోధ్యకాండ అఖండపారాయణం

తిరుమల, జూన్ 11ప్రభాతవార్తప్రతినిధి: లోకకల్యాణం కోసంశ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తూ తిరుమల నాదనీరాజనం వేదికపై మంగళవారం ఉదయం జరిగిన 11వ విడత అయోధ్యఅఖండపారాయణం184 శ్లోకాలు నిరంతరాయంగా పండితులు పఠించారు. ఉదయం 7గంటల నుండి 9గంటల వరకు సాగిన ఈ అఖండ పారాయణంలో 40వ సర్గనుండి 44వసర్గ వరకు 159 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రం 25 శ్లోకాలు ఆద్యంతం భక్తిభావాన్ని చాటింది. వేదపండితులు అఖండపారాయణం చేయగా పలువురు భక్తులు భక్తితో వారిని అనుసరించి శ్లోక పారాయణంతో తిరుమల మరింత ఆధ్యాత్మికత ఉట్టిపడింది. ధర్మగిరివేదవిజ్ఞానపీఠం పండితుడు శేషాచార్యులు, అనంత, మారుతి శ్లోక పారాయణం చేశారు.




